సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 15 । మే । 2024



జోరుగా... హుషారుగా

ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహిస్తున్న వేసవి క్రికెట్ శిక్షణ ఉత్సాహంగా సాగుతోంది. 8లో



బొగ్గు రవాణాకు అడ్డుకట్ట

లారీలకు నాణ్యమైన బొగ్గు ఇవ్వడం లేదంటూ యజమానులు కిష్టారం ఓసీ వద్ద నిరసన తెలిపారు. 8లో

గరిష్టం / కనిష్టం

37° / 26°

వాతావరణం

జిల్లాలో బుధవారం కొంతమేర ఎండ తీవ్రత ఉంటుంది. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు పుష్యమి పట్టాభిషేకం



పట్టాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి మంగళవారం పుష్యమి నక్షత్రం సందర్భంగా పట్టాభిషేకం వేడుకను కమనీయంగా జరిపారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పట్టాభిషేక క్రతువును కనులపండువగా జరిపించారు. కార్యక్రమంలో రామదీక్ష విరమణ పరులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని వీక్షించారు.

చర్ల 'ఏకలవ్య'లో నూరుశాతం ఫలితాలు

చర్ల రూరల్: సీబీఎస్‌ఈ పదో తరగతి ఫలితాల్లో చర్ల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూలు విద్యార్థులు నూరుశాతం ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎం.శకుంతల తెలిపారు. 43 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, అందరూ ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించిన కె.వర్షిత, బి.సతీష్ నాయక్, జి.అమృతలను ఆర్సీఓ వెంకటేశ్వరరాజు, పాఠశాల సిబ్బంది అభినందించారు. ఏకలవ్యలో ఇంటర్మీడియట్ ప్రవేశాల కోసం ఈ నెల 18 లోపు దరఖాస్తు చేసుకోవాలని వేరొక ప్రకటనలో కోరారు.

వచ్చే నెల 8న జాతీయ లోక్‌అదాలత్

కొత్తగూడెంటౌన్: జిల్లా కోర్టులో జూన్ 8న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. భానుమతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాక్సిడెంట్ కేసులు, సివిల్, చీటింగ్, చిట్‌ఫండ్ , భూతగాదాలు, వివాహసంబంధ, చిన్నచిన్న దొంగతనాలు, ట్రాఫిక్ చలాన్, డ్రంక్ అండ్ డ్రైవ్, కుటుంబ తగాదాలు, బ్యాంకు సంబంధిత, టెలిఫోన్, కొట్టుకున్న కేసులు, సైబర్ క్రైమ్ తదితర రకాల కేసులను లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవచ్చని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

18 వరకు గడువు పొడిగింపు

ములకలపల్లి: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్)లో ఇంటర్‌లో ప్రవేశానికి ఈ నెల 18 వరకు గడువు పొడిగించినట్లు విద్యాలయాల ప్రాంతీయ సమన్వయ అధికారి టీవీ.రాజు, ములకలపల్లి ఏకలవ్య ప్రిన్సిపాల్ రాజేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ పొందేందుకు 2023–24లో పదో తరగతి ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో సీబీఎస్‌ఈ సిలబస్ బోధిస్తారని, ఆసక్తికలిగినవారు సమీపంలో ఏకలవ్య పాఠశాలల్లో దరఖాస్తులు అందజేయాలని వివరించారు.

నేటి నుంచి దోస్త్ వెబ్ ఆప్షన్‌లు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

ఖమ్మం సహకారనగర్ : డిగ్రీ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు సంబంధించి వెబ్ ఆప్షన్ల ప్రక్రియ బుధవారం ప్రారంభమవుతుందని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జాకిరుల్లా తెలిపారు. కళాశాలలో మంగళవారం వెబ్ ఆప్షన్ల ప్రచార పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు నేటి నుంచి వెబ్ ఆప్షన్‌లు పెట్టుకోవచ్చని చెప్పారు. ఈనెల 25 వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందని, 27వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం ఉంటుందని తెలిపారు. మొదటి విడత సీట్లు కేటాయింపు జూన్ 3న వెలువడుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ బి.వి.రెడ్డి, టి.జీవన్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ సత్యవతి, దోస్త్ కో ఆర్డినేటర్ ఎం.సుబ్రమణ్యం, పరీక్షల కంట్రోలర్ ఎన్.గోపి, వేలాద్రి, బి.వెంకన్న, ఎం.వి.రమణ, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన ఓటింగ్..



ఓటేసేందుకు క్యూలో నిల్చున్న మహిళలు(ఫైల్)

గత అసెంబ్లీ ఎన్నికల్లో 79 శాతం పోలింగ్

- తాజా పార్లమెంట్ ఎన్నికల్లో 72 శాతమే..
- అశ్వారావుపేట అసెంబ్లీ పరిధిలో పెరుగుదల
- మహబూబాబాద్ స్థానంలో వెనక్కి తగ్గిన ఓటర్లు
- ఓటింగ్ శాతంపై కనిపించిన ప్రచార ప్రభావం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: శాసనసభ ఎన్నికలతో పోల్చితే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగంలో ఓటర్ల ఉత్సాహం తగ్గింది. గతేడాది నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా 79 శాతం పోలింగ్ నమోదుకాగా, ఈ నెల 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో అది 71.86 శాతానికే పరిమితమైంది.

పేటలో పెరిగింది..

జిల్లాలో కొత్తగూడెం, అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గాలు ఖమ్మం పార్లమెంట్ పరిధిలో ఉండగా, మహబూబాబాద్ పార్లమెంటు పరిధిలో పినపాక, భద్రాచలం, ఇల్లెందు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. పార్లమెంటు ఎన్నికలతో పోల్చితే అశ్వారావుపేట మినహాయిస్తే మిగిలిన నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం తగ్గుముఖం పట్టింది. పినపాక, ఇల్లెందు, భద్రాచలం పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఇంచుమించుగా ప్రతీ నియోజకవర్గంలో తొమ్మిది నుంచి పది శాతం వరకు తక్కువ ఓటింగ్ నమోదైంది. కొత్తగూడెంలో ఆరు శాతం తగ్గింది. అశ్వారావుపేటలో మాత్రం మూడు శాతం వరకు ఓటింగ్ పెరిగింది.

'కోట'లో తగ్గింది..

మానుకోట స్థానం నుంచి ప్రధాన పార్టీల తరఫున పోటీ చేసిన అభ్యర్థులందరూ ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వారే ఉన్నారు. వీరిలో కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ మినహా మిగిలిన బీఆర్ఎస్, బీజేపీల తరఫున పోటీలో ఉన్న అభ్యర్థులు భద్రాద్రి జిల్లాలో ఉన్న ఇల్లెందు, పినపాక, భద్రాచలంలో ఆశించిన స్థాయిలో ప్రచారం చేపట్టలేదు. ముఖ్యంగా బీజేపీ అభ్యర్థి అజ్మీర సీతారాం నాయక్ చుట్టపు చూపు ప్రచారానికే పరిమితమయ్యారు. ఆయన తరఫున ఆ పార్టీకి చెందిన అగ్రనేతలు కూడా భద్రాద్రి జిల్లాలో ప్రచారంపై దృష్టి పెట్టలేదు. బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవిత తరఫున కూడా స్టార్ క్యాంపెయినర్లు ఇటువైపు రాలేదు. జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావే ప్రధానంగా ప్రచార భారాన్ని భుజాలకెత్తుకున్నారు. దీంతో మానుకోట పరిధిలోని అసెంబ్లీ స్థానాల్లో ఆశించిన స్థాయిలో ఊపు రాలేదు. దాని ప్రభావం వల్లే మానుకోట పరిధిలో ఉన్న మూడు స్థానాల్లో ఓటింగ్ శాతం తగ్గిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జిల్లా వ్యాప్తంగా పోలింగ్ శాతం వివరాలు

నియోజకవర్గం	అసెంబ్లీ	పార్లమెంట్
పినపాక	79.55	69.40
ఇల్లెందు	79.32	70.48
కొత్తగూడెం	76.56	69.47
అశ్వారావుపేట	78.36	80.95
భద్రాచలం	78.66	69.02
మొత్తం	79.00	71.86

ఖమ్మంపైనే దృష్టి..

జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో జనరల్ స్థానం కింద ఉన్న ఖమ్మంపైనే అన్ని పార్టీల్లోని స్థానిక నాయకత్వం ఎక్కువగా దృష్టి సారించింది. ఫలితంగా మహబూబాబాద్ పరిధిలోని ఇల్లెందు, భద్రాచలం, పినపాకలలో ఓటింగ్ శాతం తగ్గగా అశ్వారావుపేటలో పోలింగ్ శాతం పెరిగింది. అర్బన్ ఓటర్లు ఎక్కువగా ఉన్న కొత్తగూడెంలో పోలింగ్ శాతం తగ్గుదల, మిగిలిన గ్రామీణ నియోజకవర్గాలతో పోల్చితే తక్కువగా నమోదు కావడం గమనార్హం. ముఖ్యంగా ఖమ్మం నుంచి పోటీ చేస్తున్న అన్ని ప్రధాన పార్టీల అభ్యర్థులు రామసహాయం రఘురాంరెడ్డి, నామా నాగేశ్వరరావు, తాండ్ర వినోద్‌రావులు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన వారుగా ఉన్నారు. పైగా వీరి గెలుపు కోసం కాంగ్రెస్ తరఫున సీఎం రేవంత్ రెడ్డి మొదలు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల, పొంగులేటి ప్రచార బాధ్యతలు తీసుకున్నారు. కింది స్థాయి కేడర్ సైతం అహర్నిశలు శ్రమించారు. బీఆర్ఎస్ తరఫున మాజీ సీఎం కేసీఆర్, బీజేపీ తరఫున జేపీ నడ్డాలు ప్రచారం కూడా నిర్వహించారు. ఇలా అగ్రనేతలు ప్రచారంలో పాల్గొనడంతో ఎన్నికల పరంగా జోష్ కనిపించింది. దాని ఫలితం బ్యాలెట్‌లోనూ కనిపించింది.

ఆదాయానికి మించి ఖర్చు



శ్రీ సీతారామ చంద్రస్వామివారి దేవస్థానం(ఫైల్)

- బ్రహ్మోత్సవాలకు రూ.2.37 కోట్ల వ్యయం
- ఆదాయం రూ.1.89 కోట్లు మాత్రమే
- శ్రీరామనవమి లెక్కలు తేల్చిన దేవస్థానం అధికారులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగిన శ్రీరామనవమి, పట్టాభిషేకం ఉత్సవాల లెక్కలను అధికారులు ఎట్టకేలకు తేల్చారు. ఆదాయం కంటే ఖర్చే ఎక్కువగా ఉంది. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకు రూ.2,37,30,121 ఖర్చు చేయగా, అన్ని మార్గాల ద్వారా రూ.1,89,61,124 ఆదాయం సమకూరింది. సెక్టార్ల ద్వారా సుమారు రూ.93 లక్షలు, పరోక్ష సేవల ద్వారా రూ.7 లక్షలు, పోస్టల్ ద్వారా అంతరాలయ సేవలకు రూ.90 వేలు, పోస్టల్‌లో తలంబ్రాల బుకింగ్ ద్వారా రూ.75 వేలు, టీఎస్ఆర్టీసీ కార్గో ద్వారా రూ.23.20 లక్షలు, దేవస్థానంలోని కౌంటర్లలో తలంబ్రాల విక్రయం ద్వారా రూ.7.88 లక్షల ఆదాయం లభించింది. 100 గ్రాముల లడ్డూలు రెండు లక్షల వరకు విక్రయించగా, రూ. 49 లక్షలు, 7,451 మహా లడ్డూల అమ్మకం ద్వారా రూ.7.45 లక్షల ఆదాయం సమకూరింది.

సగమే అమ్ముడుపోయిన సెక్టార్ల టికెట్లు

ఈ ఏడాది ముందస్తుగా సెక్టార్ల టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినా సుమారు సగం మాత్రమే అమ్ముడుపోయాయి. కల్యాణానికి అన్ని సెక్టార్ల టికెట్లు 16,213 అందుబాటులో ఉంచగా, కేవలం 8936 టికెట్లు మాత్రమే విక్రయమైనట్లు అధికారులు తెలిపారు. టికెట్ల అమ్మకం ద్వారా మొత్తం రూ.1,77,71,150 ఆదాయం రావాల్సి ఉండగా, రూ.89,96,150 ఆదాయం మాత్రమే వచ్చింది. ఇక పట్టాభిషేకానికి మొత్తం 3,640 టికెట్లు అందుబాటులో ఉంచగా, 529 టికెట్లే అమ్ముడుపోయాయి. దీంతో రూ.33,24,000 రావాల్సి ఉండగా, కేవలం రూ.3 లక్షల ఆదాయమే సమకూరింది. కల్యాణం, పట్టాభిషేకాలలో మొత్తంగా 9,465 టికెట్లు అమ్ముడుపోగా రూ. 93,01,450 ఆదాయం వచ్చిందని దేవస్థానం అధికారులు తెలిపారు. సెక్టార్ల టికెట్లు విడివిడిగా పరిశీలిస్తే ఉభయదాతల టికెట్లు 668, వెయ్యి రూపాయల టికెట్లు 884 అమ్ముడుపోయాయి.

ఖాళీగా వదిలిన జెడ్, వీఐపీ సెక్టార్ల వివరాలు..

ఈ ఏడాది ఎన్నికల కోడ్ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి వేడుకలకు హాజరుకాలేదు. దీంతో సీఎం సెక్టార్‌ను జిల్లా ఉన్నతాధికారులు జెడ్, వీఐపీ సెక్టార్లుగా విభజించారు. కల్యాణానికి జెడ్ సెక్టార్‌లో రూ.పది వేలతో 100, వీఐపీ సెక్టార్‌లో రూ. 5 వేలతో 250 టికెట్లను, పట్టాభిషేకానికి జెడ్ సెక్టార్‌లో రూ.5వేలతో 100, వీఐపీ సెక్టార్‌లో రూ.2,500తో 250 టికెట్లను ప్రత్యేకంగా ముద్రించారు. కల్యాణానికి జెడ్, వీఐపీ సెక్టార్ల ద్వారా రూ.22.50 లక్షలు, పట్టాభిషేకానికి రూ.11.25 లక్షల ఆదాయం రావాల్సి ఉంది. అయితే గత శనివారం దేవస్థానం అధికారులు విడుదల చేసిన లెక్కల్లో ఈ విభాగాలను ఖాళీగా ఉంచటం గమనార్హం. నవమి రోజున జెడ్, వీవీఐపీ సెక్టార్లు పూర్తిగా నిండిపోయాయి. ఆ టికెట్లను సైతం జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ముద్రించిన టికెట్లతోనే విక్రయించారు. అయితే ఆ లెక్కలను దేవస్థానం అధికారులకు ఇప్పటికీ అప్పగించలేదని సమాచారం. దీంతో ఆ టికెట్ల ద్వారా దేవస్థానం ఆదాయం సుమారు రూ.33 లక్షల మేర గండి పడినట్లు తెలుస్తోంది. కనీసం ఆ ఆదాయం దేవస్థానానికి అప్పగించినా కనీసం ఖర్చు వరకు వచ్చి ఉండేదని ఆలయ వర్గాలు పేర్కొంటున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు ఆ లెక్కలను అప్పగిస్తారా... లేదా అలాగే వదిలేస్తారా...అనేది తేల్చాల్సి ఉంది.

మారుమూల ప్రాంతాల్లో పోలింగ్ సక్సెస్

కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాచలం/మణుగూరు రూరల్: భద్రాచలం, పినపాక అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ సెక్టార్ల వారీగా అన్ని పోలింగ్ స్టేషన్లలో ప్రశాంతంగా ముగిసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల పేర్కొన్నారు. ఎన్నికల విధులు నిర్వర్తించిన ఉద్యోగులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. సోమవారం రాత్రి భద్రాచలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భద్రపర్చిన పోలింగ్ సామగ్రి రూంను, మణుగూరు స్ట్రాంగ్ రూంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భద్రాచలం నియోజకవర్గంలో 176 పోలింగ్ స్టేషన్లలో సెక్టార్ల వారీగా పోలింగ్ ప్రక్రియ విజయవంతంగా జరిగిందన్నారు. మారుమూల సమస్యాత్మక మండలాలైన చర్ల, దుమ్ముగూడెంలలో పోలింగ్ ప్రక్రియ ముగియగానే ప్రత్యేక పోలీస్, సీఆర్పీఎఫ్ బలగాల సెక్యూరిటీతో పోలింగ్ సామగ్రిని ముందుగానే తరలించినట్లు తెలిపారు. 176 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 25 మంది సెక్టార్ అధికారులు, 120 మంది మైక్రో అబ్జర్వర్లు, పీఓలు, ఏపీఓలు, ఓపీఓలు, పోలింగ్ సిబ్బంది.. మొత్తం 844 మంది సమర్థంగా పనిచేశారని పేర్కొన్నారు. మణుగూరు స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపర్చిన పోలింగ్ సామగ్రిని భద్రత నడుమ మహబూబాబాద్ స్ట్రాంగ్ రూమ్‌కు చేరవేయాలని ఆదేశించారు. ఐటీడీఏ పీఓ, ఏఆర్ఓ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ ఓటింగ్ ప్రక్రియ ముగియగానే పోలింగ్ సామగ్రి స్ట్రాంగ్ రూమ్‌కు చేర్చినట్లు తెలిపారు. పినపాక నియోజకవర్గంలోని 250 కేంద్రాల్లో పోలింగ్ సరళిని వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించామని తెలిపారు. మారుమూల ప్రాంతాలైన గుండాల, ఆళ్లపల్లి, కరకగూడెం మండలాల నుంచి పటిష్ట బందోబస్తు నడుమ పోలింగ్ సామగ్రి స్ట్రాంగ్ రూమ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, ఆర్డీఓ దామోదర్‌రావు, అధికారులు డేవిడ్ రాజు, మణెమ్మ, భాస్కర్, సురేష్‌బాబు, రమణయ్య, తహసీల్దార్లు శ్రీనివాస్, రాఘవరెడ్డి, సిబ్బంది నాగరాజు, కృష్ణ, మహీధర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూంలో ఈవీఎంల బాక్స్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక, ఏఎస్పీ పరితోష్

12,41,135 మంది ఓటేశారు..



- ఖమ్మం, కొత్తగూడెంలో తక్కువగా పోలింగ్
- పాలేరులో అత్యధికంగా 83.77 శాతం నమోదు

సాక్షిప్రతినిధి, ఖమ్మం : ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల్లో 16,31,039 మంది ఓటర్లకు గాను 12,41,135 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. అంటే 76.09 శాతం పోలింగ్ నమోదైంది. 7,87,160 మంది పురుషులకు.. 6,05,969 మంది, 8,43,749 మంది మహిళలకు 6,35,099 మంది ఓటు వేశారు. సంఖ్యాపరంగా మహిళలే ఎక్కువ మంది ఓటు వేసినా.. శాతంలో లెక్కిస్తే పురుషులు 76.98 శాతం, మహిళలు 75.27 శాతం మంది మాత్రమే ఉండడం గమనార్హం.

పాలేరులో అత్యధికంగా..

ఈ ఎన్నికల్లో పాలేరు నియోజకవర్గంలో అత్యధికంగా పోలింగ్ నమోదైంది. ఇక్కడ 2,40,806 మంది ఓటర్లకు గాను 2,01,721 మంది ఓటు వేశారు. అంటే 83.77 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లోనూ పాలేరు నియోజకవర్గంలో ఎక్కువ శాతం ఓట్లు పోలయ్యాయి. అలాగే ఖమ్మంలో 62.97 శాతం, కొత్తగూడెంలో 69.47 శాతం మాత్రమే ఓటింగ్ నమోదైంది.

నియోజకవర్గాల వారీగా పోలింగ్ వివరాలు..

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
ఖమ్మం	3,24,073	2,04,078	62.97
పాలేరు	2,40,806	2,01,721	83.77
మధిర	2,22,160	1,81,815	81.84
వైరా	1,93,389	1,56,762	81.06
సత్తుపల్లి	2,43,943	1,95,979	80.34
కొత్తగూడెం	2,47,494	1,71,928	69.47
అశ్వారావుపేట	1,59,174	1,28,852	80.95
మొత్తం	16,31,039	12,41,135	76.09

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

భవితవ్యం.. నిక్షిప్తం

- పోలింగ్ సరళిపై అభ్యర్థుల ఆరా
- ఎక్కడెక్కడ అనుకూలంగా ఉందనే అంశంపై చర్చ
- జూన్ 4న తేలనున్న ఫలితం..
- గెలుపు తమదేనని కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థుల ధీమా

సాక్షిప్రతినిధి, ఖమ్మం: పార్లమెంట్ ఎన్నికల సంగ్రామం ముగిసింది. అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమై ఉంది. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 76.09 శాతం ఓటింగ్ నమోదైంది. సోమవారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసిన అనంతరం ఈవీఎంలను ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌లోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించారు. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటుచేశారు. జూన్ 4న జరిగే లెక్కింపుతో ఫలితం తేలనుంది. గెలుపోటములు తేలేందుకు 21 రోజుల సమయం ఉండడంతో అభ్యర్థుల నుంచి లోతైన విశ్లేషణ జరుగుతోంది. ఎక్కడ తమకు భారీగా ఓట్లు పోలయ్యాయి.. ఎక్కడ మైనస్‌లో ఉన్నామనే అంచనాల్లో మునిగారు. ఎవరి విశ్లేషణలు వారికి ఉన్నా.. గెలుపు తమదేననే ధీమా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థుల్లో వ్యక్తమవుతోంది. మరోవైపు గెలుపోటములు అటుంచితే ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయి..? గెలిచే అభ్యర్థికి ఎంత మెజార్టీ వస్తుందనే దానిపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పందేలు జోరందుకున్నాయి.

ఏం జరిగింది..?

ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ సరళిపై అభ్యర్థులు పోస్టుమార్టమ్ నిర్వహిస్తున్నారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం మొత్తం పోలింగ్ రిపోర్టును తెప్పించుకున్న అభ్యర్థులు ముఖ్య నేతలతో కలిసి ఎక్కడెక్కడ ఎంతమేరకు పోలింగ్ నమోదైందనే దానిపై చర్చలు జరుపుతున్నారు. అలాగే పోలింగ్ ఏజెంట్లతో కూడా మాట్లాడి బూత్‌ల వారీగా నమోదైన ఓట్లు.. తమకు వచ్చిన ఓట్లపై ఆరా తీస్తున్నారు. అసెంబ్లీల వారీగా నమోదైన పోలింగ్ శాతం, అనుకూల, ప్రతికూల అంశాలపై అంచనాలు వేస్తున్నారు. ఆయా పార్టీల అధిష్టానాలు కూడా ఖమ్మం పార్లమెంట్ పరిధిలో ఓటింగ్ సరళి ఎలా ఉందని తెలుసుకుంటున్నాయి. తమకు అనుకూలమైన ఓటింగ్ పడే డివిజన్లు, వార్డులు, కాలనీలు ఏవి..? అక్కడ ఎంత మేరకు పోలింగ్ జరిగింది, ఎక్కడ తక్కువ ఓట్లు వస్తాయి..? తదితర అంశాలపై కూలంకషంగా చర్చిస్తున్నారు.

అభ్యర్థుల్లో ఆత్మవిశ్వాసం..

ఈ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు గెలుపు తమదేనని ధీమాగా ఉన్నారు. పోలింగ్ అనంతరం తమకు అనుకూలమైన వాతావరణం ఉందనే భావన వ్యక్తమవుతోంది. కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి గెలుపు తమదేనని పార్టీ నేతలు, నాయకులు, కేడర్ వద్ద చెబుతున్నారు. గెలుపు ఖాయమని, లక్ష నుంచి 1.50 లక్షల ఓట్ల మెజార్టీతో గెలవడం ఖాయమనే అంచనాకు ఆ పార్టీ వచ్చినట్లు తెలుస్తోంది. ఆరు గ్యారంటీలు, ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు, కేడర్ ఉండటం, బలమైన ఓటు బ్యాంకు కలిగి ఉండటం తమకు కలిసి వస్తాయనే ఆలోచనలో కాంగ్రెస్ పార్టీ ఉంది. బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు కూడా ఓటింగ్ సరళిని బట్టి చూస్తే తమకే అనుకూలంగా ఉందనే భావన వ్యక్తం చేస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పర్యటనకు భారీ స్పందన రావడం, ప్రభుత్వ వ్యతిరేకత తమకు అనుకూలంగా ఉంటుందనే ధీమా బీఆర్ఎస్ నేతల్లో ఉంది. ప్రధానంగా రైతులు, కార్మికులు తమకే ఓట్లు వేశారని విశ్లేషిస్తున్నారు. ఇక బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు తన గెలుపుపై లెక్కలు వేయడంలో మునిగారు. మోదీ మానియా, కేంద్ర ప్రభుత్వ పథకాలు తమకు అనుకూలమైన ఓటు పడేలా చేశాయనే ఉద్దేశంలో ఆయన ఉన్నారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం వంటి అంశాలు తమకు కలిసి వస్తున్నాయని బీజేపీ అభిప్రాయం వ్యక్తం చేస్తోంది.

ఈ పోలింగ్ దేనికి సంకేతం..

గత పార్లమెంట్ ఎన్నికల్లో జరిగిన పోలింగ్ శాతంతో పరిశీలిస్తే ప్రస్తుత పోలింగ్ స్థిరంగా ఉంది. 2019 ఎన్నికల్లో 75.30 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకోగా.. ఈసారి 76.09 శాతం మంది ఓటు వేశారు. గత ఎన్నికలతో పోలిస్తే స్వల్పంగా ఓటింగ్ శాతం పెరిగింది. 2009 ఎన్నికల్లో 82.08 శాతం, 2014 ఎన్నికల్లో 82.13 శాతం పోలింగ్ నమోదైంది. ఆ రెండు ఎన్నికల కన్నా.. ఇప్పుడు పోలింగ్ శాతం కొంత తగ్గుముఖం పట్టింది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావుకు 5,67,459 ఓట్లు రాగా.. కాంగ్రెస్ అభ్యర్థి రేణుకా చౌదరికి 3,99,397 ఓట్లు వచ్చాయి. ఇక సీపీఎం అభ్యర్థి బోడా వెంకట్‌కు 57,102 ఓట్లు, బీజేపీ అభ్యర్థి దేవకి వాసుదేవరావుకు 20,488 ఓట్లు వచ్చాయి. ఈ సారి కూడా 76.09 శాతం పోలింగ్ జరగడంతోపాటు సీపీఎం కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఫలితాలపై విశ్లేషిస్తున్న కాంగ్రెస్ భారీ మెజార్టీ ఖాయమన్న ఆనందంలో ఉంది. ప్రభుత్వంపై వ్యతిరేక ఓటు తమ విజయానికి నాంది అని బీఆర్ఎస్ చెబుతోంది. బీజేపీ కూడా ఇదే రీతిలో గెలుపుపై ఆశలు పెట్టుకుంది.



స్ట్రాంగ్ రూమ్‌లో పరిశీలిస్తున్న ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్



ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పోలీస్ పహారా

అక్కడ ఎందుకు తగ్గింది..?

ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో నమోదైన పోలింగ్‌ను విశ్లేషిస్తే.. ఖమ్మం, కొత్తగూడెం నియోజకవర్గాల్లోనే తక్కువగా ఓటింగ్ నమోదైంది. ఖమ్మం నియోజకవర్గంలో 62.97 శాతం, కొత్తగూడెం నియోజకవర్గంలో 69.47 శాతం మంది ఓట్లు వేశారు. మిగిలిన ఐదు నియోజకవర్గాల్లో 80 శాతం పైగా పోలింగ్ నమోదు కావడంతో ఇక్కడ కలిసొచ్చేది ఎవరికి.. తగ్గిన చోట ఎవరికి నష్టమనే విశ్లేషణ జరుగుతోంది. పోల్ మేనేజ్‌మెంట్‌లో వెనుకపడ్డామా..? అసలు ఎందుకు పోలింగ్ శాతం తగ్గిందనే కారణాలను అభ్యర్థులతోపాటు ఆ పార్టీల నేతలు అన్వేషిస్తున్నారు.

క్లుప్తంగా

సీబీఎస్ఈలో సత్తాచాటిన విద్యార్థులు


భూక్య రామ్‌చరణ్

భద్రాచలంటౌన్: సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన ఏకలవ్య మోడల్ పాఠశాలల విద్యార్థినులు సత్తాచాటారు. ఈ నెల 13న విడుదలైన టెన్త్ సీబీఎస్ఈ ఫలితాల్లో 415 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 413 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 8 విద్యాలయాలకు (ఖమ్మం-1, భద్రాద్రి కొత్తగూడెం-7)గాను 6 విద్యాలయాలు (ఈఎంఆర్ఎస్, గండుగులపల్లి, చర్ల, దుమ్ముగూడెం, ములకలపల్లి, టేకులపల్లి, గుండాల) వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఈఎంఆర్ఎస్, సింగరేణి విద్యార్థి భూక్య రామ్‌చరణ్ 500 మార్కులను గాను 447 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచాడు. దీంతో భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ మంగళవారం ఒక ప్రకటన ద్వారా అభినందనలు తెలిపారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంటౌన్: తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొనసాగుతున్న ఎనిమిది ఏకలవ్య మోడల్ సంక్షేమ విద్యాలయాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీబీఎస్ఈ సిలబస్ బోధనలో ఇంటర్ మొదటి సంవత్సరానికి ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులలో ప్రవేశం పొందవచ్చని పేర్కొన్నారు. 2023 – 24 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థులు ఈనెల 18వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలో బాలికలకు గండుగులపల్లి, పాల్వంచ, గుండాల, బాలురకు టేకులపల్లి, దుమ్ముగూడెం, చర్ల, ములకలపల్లి, సింగరేణి కళాశాలల్లో వివిధ గ్రూపుల్లో సీట్లు ఉన్నాయని వివరించారు. ఆసక్తి ఉన్నవారు ఎంచుకున్న ఈఎంఆర్ఎస్ విద్యాలయాలలో దరఖాస్తులు అందజేయాలని, పదో తరగతిలో సీజీపీఏ, సీబీఎస్ఈ మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని వెల్లడించారు. ఇందుకు గాను ఈనెల 22న చర్ల విద్యాలయంలో కౌన్సిలింగ్ ఉంటుందని పీఓ తెలిపారు.

వెనుదిరిగిన పోలీస్ బలగాలు

చర్ల: పార్లమెంట్ ఎన్నికలు ముగియడంతో సరిహద్దు నుంచి పోలీస్ బలగాలు వెనుదిరిగాయి. వారం రోజుల కిందట సరిహద్దు ప్రాంతానికి భారీగా చేరుకున్న సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ, కోబ్రా బలగాలు ముమ్మరంగా కూంబింగ్ ఆపరేషన్ కొనసాగించగా, సోమవారం సాయంత్రం పార్లమెంట్ ఎన్నికలు ముగియడంతో బలగాలు అడవిని వీడుతున్నాయి. సరిహద్దు ప్రాంతంలోని పూసుగుప్ప, చెన్నాపురం, ఎర్రంపాడు, బత్తినపల్లి, పులిగుండాల, కుర్నపల్లి, బోదనెల్లి తదితర గ్రామాల సమీపాల్లోని అటవీ ప్రాంతంలో పోలీసులు ముమ్మరంగా కూంబింగ్ నిర్వహించారు. ఎస్పీ రోహిత్‌రాజ్ ఆదేశాలతో ఏఎస్పీ పరితోష్ పంకజ్, ఓఎస్డీ సాయిమనోహర్ నేతృత్వంలో సరిహద్దులో భారీగా బలగాలు మోహరించాయి. ఆదివాసీలకు ఎన్నికలపై అవగాహన కల్పించి వారిని పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓట్లు వేసేలా ప్రోత్సహించారు.

ఉచితంగా 'నర్సింగ్' శిక్షణ

ఇల్లెందు: తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లోని నిరుద్యోగ యువతుల కోసం ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ, హెచ్ఎస్‌బీసీ సహకారంతో హైదరాబాద్‌లోని ప్రథమ్ హెల్త్ కేర్ శిక్షణ కేంద్రంలో రెండు నెలల పాటు నర్సింగ్ అసిస్టెంట్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ సరిత సింగు మంగళవారం తెలిపారు. శిక్షణ పూర్తయిన వారికి 100 శాతం ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. ఉపాధి ఆధారిత శిక్షణ కార్యక్రమాలకు అర్హత ఆసక్తి గల గ్రామీణ/పట్టణ ప్రాంత అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, నర్సింగ్ అసిస్టెంట్‌కు రెండు నెలలు కాలం, 18 నుంచి 30 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు 90002 03952 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


దేవయ్య (ఫైల్)

ఖమ్మంఅర్బన్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన ఖమ్మం నగరంలోని బోనకల్ రోడ్డు.. ధంసలాపురం వంతెనపై మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. చింతకాని మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన వార్డు మాజీ సభ్యుడు, పెయింటర్ గుంటి దేవయ్య (50)కు ఇద్దరు కుమార్తెలుండగా వారు హైదరాబాద్‌లో చదువుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేసేందుకు వారు సోమవారం రాగా.. మంగళవారం తెల్లవారుజామున వారిని హైదరాబాద్ పంపించేందుకు ద్విచక్రవాహనంపై ఖమ్మం వచ్చాడు. వారిని బస్సు ఎక్కించి తిరిగి రామకృష్ణాపురం వస్తున్న ఆయన ద్విచక్రవాహనం బ్రిడ్జి ఎక్కుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లింది. ప్రాణాపాయస్థితిలో ఉన్న ఆయన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఖమ్మంఅర్బన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, కూతుర్లకు టాటా చెప్పిన కొద్ది సమయంలోనే ఆయన మృతిచెందటంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

జోరుగా... హుషారుగా


క్రికెట్ ప్రాక్టీస్ చేస్తున్న ఔత్సాహిక క్రీడాకారులు

- ఖమ్మంలో కళకళలాడుతున్న హెచ్‌సీఏ క్రికెట్ శిబిరం
- హాజరవుతున్న 90 మంది ఔత్సాహిక క్రికెటర్లు
- నిత్యం పర్యవేక్షిస్తున్న అసోసియేషన్ నాయకులు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నూతనంగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో నిర్వహిస్తున్న వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం జోరుగా హుషారుగా కొనసాగుతోంది. ఈ శిక్షణ శిబిరానికి ఔత్సాహిక క్రికెటర్లు దాదాపు 90 మంది తరలివస్తున్నారు. వారిలో ప్రతిభను మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటామని శిబిరం నిర్వాహకులు తెలిపారు. ప్రధానంగా హెచ్‌సీఏ పరిధిలో జరిగే అండర్-14, 16, 19 కేటగిరిల్లో అధిక సంఖ్యలో క్రికెటర్లు వచ్చేలా చొరవ చూపుతున్నామని చెబుతున్నారు. ఈ శిక్షణ శిబిరంలో ప్రతిభ కనబరిచి వారిని హెచ్‌సీఏ ఆధ్వర్యంలో జరిగే క్రికెట్ లీగ్ టోర్నీలకు పంపేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. హెచ్‌సీఏ అధ్యక్షుడు ఎ.జగన్ మోహన్ రావు ఆదేశాల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గౌతంపూర్, ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ శిబిరంలో పాల్గొనే వారికి బాల్స్, బ్యాట్లు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. ఉదయం, సాయంత్రం వేళలో ఖమ్మంలో జరిగే శిక్షణ శిబిరానికి మరింత మంది హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. శిక్షణ శిబిరానికి వస్తున్న ఔత్సాహిక క్రికెట్‌టర్లు వారి మనోగతాలను 'సాక్షి'తో పంచుకున్నారు. అవి వారి మాటల్లోనే..

హెచ్‌సీఏ చొరవతో శిక్షణ శిబిరం



జిల్లా కేంద్రంలోని క్రికెట్ నెట్స్‌లో హెచ్‌సీఏ ఆదేశాలనుసారం వచ్చే నెల 20వ తేదీ వరకు శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నాం. ఈ కోచింగ్‌కు ఆశించిన స్థాయి కంటే అధికంగానే ఔత్సాహిక క్రికెటర్లు వస్తున్నారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ వారు మాకు కావాల్సిన క్రికెట్ పరికరాలు అందుబాటులోకి తేవడంతో వాటిని సద్వినియోగం చేసుకుంటున్నాం. క్రికెటర్లకు బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్, కీపింగ్ అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. వారిలో సామర్థ్యం పెంచేందుకు ఫిట్‌నెస్ కూడా బాగా నేర్పిస్తున్నాం.

– ఎం.డీ.ఫారూఖ్, క్రికెట్ నెట్స్ ప్రతినిధి

కోచింగ్ బాగుంది



క్రికెట్ కోచింగ్‌లో బ్యాటింగ్, బౌలింగ్ బాగా నేర్పుతున్నారు. బ్యాట్ ఎలా పట్టుకోవాలి, బౌలింగ్ ఎలా చేయాలనే దానిపై ఇద్దరు కోచ్‌లు బాగా అవగాహన కల్పిస్తున్నారు. నాకు బ్యాటింగ్ అంటే ఇష్టం. అండర్-14 క్రికెట్‌లో ఆడాలని ఉంది. కేవలం వేసవి సెలవుల్లోనే కాకుండా రోజూ ఉదయం, సాయంత్రం కోచింగ్‌కు వస్తా. బాగా ఆడేందుకు ప్రయత్నం చేస్తా.

– ఎ.ధనుష్‌కుమార్

బాగా ప్రాక్టీస్ చేస్తా...



బ్యాటింగ్ చేస్తే వెంటనే ఔట్ అవుతున్నా. అయినా శిక్షకులు బాగా ప్రోత్సహిస్తున్నారు. బ్యాటింగ్ బాగా వచ్చే వరకు ప్రాక్టీస్ చేస్తా. వేసవి వరకే కాకుండా రోజూ ప్రాక్టీస్ చేసేందుకు క్రికెట్ నెట్స్‌కు వస్తా. స్కిల్స్‌ను ఎక్కువగా నేర్చుకోవాలని, అప్పుడే బ్యాటింగ్ చేయడం వస్తదని సార్లు చెబుతున్నారు.

– ఎం.డీ.మాజ్

బౌలింగ్, ఫీల్డింగ్ బాగా చేస్తున్నా



తొందరలోనే బౌలింగ్, ఫీల్డింగ్ నేర్చుకున్నా. కోచ్‌లు చేప్పే విధంగానే మంచిగా బౌలింగ్ వేస్తున్నా. మంచి బౌలర్ కావాలనే ఉంది. హెచ్‌సీఏ ఆధ్వర్యంలో జరిగే టోర్నీలో బాగా బౌలింగ్ చేస్తా. సెలవుల్లో ఎక్కడికీ వెళ్లకుండా రోజూ ప్రాక్టీస్ చేసి జిల్లాలోనే మంచి బౌలర్‌ను కావాలని ఉంది. కోచింగ్ బాగానే ఇస్తున్నారు.

– ఎస్.కే.ఉజ్రయిల్

అధికారులపై చర్య తీసుకోవాలి

ఖమ్మంసహకారనగర్: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలో సజావుగా ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులపై లాఠీచార్జీ చేయించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని టీపీటీఎఫ్ బాధ్యులు వై.అశోక్‌కుమార్, పి.నాగిరెడ్డి ప్రధాన ఎన్నికల అధికారిని కోరారు. రాష్ట్రంలో ఒకేవిధంగా రెమ్యునరేషన్ ఇవ్వాలని డిమాండ్ చేసిన ఉపాధ్యాయులపై పోలీసులు అసహనంగా లాఠీచార్జ్ చేశారన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేస్తారని చెప్పిన అధికారులే ఎన్నికలు ముగిసిన తర్వాత సరైన రెమ్యునరేషన్ ఇవ్వకుండా పోలీసులతో బలప్రయోగం చేయించడం అత్యంత బాధాకరమన్నారు. ఐదు రోజుల రెమ్యునరేషన్ ఇవ్వకుండా ఈ ఘటనకు బాధ్యులైన ఆర్డీఓ తదితర అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

తెలంగాణ తొలి తరం ఉద్యమకారుడు మృతి


నివాళులర్పిస్తున్న దిండిగాల తదితరులు

ఇల్లెందు: తొలి తరం తెలంగాణ ఉద్యమకారుడు కొలిశెట్టి రాందాస్ సోమవారం రాత్రి హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. మంగళవారం ఇల్లెందులోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద రాందాస్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా గ్రంథాలయ కమిటీ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్ మాట్లాడుతూ.. 1969లో నాన్ ముల్కీ ఉద్యమం, తెలంగాణ జన సమితిని స్థాపించిన సభ్యుల్లో రాందాస్ ఒకరని, మలి దశ ఉద్యమంలోనూ ఆయన పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో చందా చంద్రశేఖర్, ఆదెపు రాంచందర్, రాజిరెడ్డి, సిలివేరు సత్యనారాయణ, జీవీ సాగర్, ఎం.రమేశ్, అబ్దుల్ నబీ, రాచపల్లి శ్రీను, డేరంగుల పోషం, సర్దార్, పీవీ కృష్ణారావు, గిన్నారపు రాజేశ్, పాలడుగు రాజశేఖర్, నిఖిల్, రాము తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి యువకుడు మృతి


మోతీలాల్ (ఫైల్)

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనిధి ఫంక్షన్ హాల్ వద్ద ట్రాక్టర్ బోల్తాపడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్‌ఐ రమణారెడ్డి కథనం మేరకు.. గడ్డిగుట్ట గ్రామానికి చెందిన ధరావత్ రాంపాల్ కుమారుడు మోతీలాల్ (22) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తెల్లవారుజామున మోతీలాల్ కారుకొండ నుంచి ట్రాక్టర్ డ్రైవ్ చేస్తూ హేమచంద్రాపురం వైపు వస్తుండగా శ్రీనిధి ఫంక్షన్‌హాల్ మూలమలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన మోతీలాల్‌ను స్థానికులు కొత్తగూడెంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రమణారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి...

దమ్మపేట: ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని అల్లిపల్లి గ్రామ శివారులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని చిల్లగుంపు గ్రామానికి చెందిన గండికోట మోతే (42) ఏపీలోని ఏలూరు జిల్లా చింతలపూడి మండలం ఎర్రగుంటపల్లి గ్రామానికి సోమవారం అర్ధరాత్రి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. అల్లిపల్లి గ్రామ శివారులోని ముత్యాలమ్మతల్లి ఆలయ సమీపంలో బైక్ అదుపుతప్పడంతో కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన మోతేను అశ్వారావుపేట ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి కుమారుడు గండికోట నవీన్ మంగళవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లుగా ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి...

అశ్వారావుపేటరూరల్: ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ శివరామకృష్ణ కథనం ప్రకారం.. ఏపీలోని తిరుపతి ప్రాంతానికి చెందిన గుజరాత్ రాహుల్ (35)కు పదిహేనేళ్ల కిందట అశ్వారావుపేట మండల కేంద్రంలోని నందమూరినగర్‌కు చెందిన శిల్పతో వివాహమైంది. కాగా, మనస్పర్థల కారణంగా భార్య పుట్టింటికి వచ్చింది. దీంతో ఈ నెల 10వ తేదీన రాహుల్ భార్య వద్దకు వచ్చి కాపురానికి రావాలని కోరగా, ఆమె నిరాకరించడంతో బంధువులతో మాట్లాడిన తరువాత స్థానిక ఆర్‌టీఎస్ చెక్‌పోస్టు సమీపంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన తెలిసిందే. గమనించిన స్థానికులు, కానిస్టేబుల్ మనోజ్ రక్షించి స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్న క్రమంలోనే ఈ నెల 11వ తేదీ అర్ధరాత్రి పరిస్థితి విషమించి మృతి చెందాడు. దీనిపై మృతుడి తమ్ముడు గుజరాత్ వెంకటేశ్వరరావు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడు..

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ గ్రామ పంచాయతీ లలితాపురం గ్రామంలో విద్యుదాఘాతంతో పూనెం ధన్‌రాజ్ (38) మంగళవారం మృతిచెందాడు. ఇంట్లో ఫ్యాన్ సరిగా తిరగడం లేదని స్వయంగా వైర్లు తొలగించి స్విచ్ ఆఫ్ చేయకుండానే బిగిస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేస్తున్న క్రమంలోనే ధన్‌రాజ్ మృతిచెందాడు. మృతుడి తండ్రి యాదగిరి అతని చిన్నతనంలోనే మృతిచెందగా అంగన్‌వాడీ పాఠశాలలో ఆయాగా పనిచేస్తున్న తన తల్లి ఆదెమ్మ ఉంది. భర్తను, ఒక్కగానొక్క కుమారుడిని కోల్పోయిన ఆదెమ్మ రోదిస్తున్న తీరు స్థానికులను కలిచివేసింది. ఆదెమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

ఖమ్మంఅర్బన్: నగరంలోని ధంసలాపురం పాతకాలనీలో పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. ఎదురుపడిన పది మందిపై దాడికి దిగి గాయపరిచింది. వివరాలిలా ఉన్నాయి.. సోమవారం సాయంత్రం పిచ్చికుక్క కాలనీలో పరుగులు తీస్తూ ఎదురుగా కనపడిన వారిని కరిచింది. వారంతా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామాల్లో, కాలనీల్లో విచ్చలవిడిగా తిరుగుతున్న కుక్కలను నియంత్రించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ముగ్గురిపై కుక్క దాడి

కామేపల్లి: మండలంలోని పండితాపురం గ్రామంలో ముగ్గురిపై ఓ కుక్క దాడి చేసి గాయపర్చింది. గ్రామానికి చెందిన దుద్దుకూరి నిత్యా, తోటకూరి నాగమణి, నాలుగేళ్ల బాలుడు సురిపిన్ని పిన్నయ్‌పై కుక్క దాడి చేసి గాయపర్చింది. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, నిత్యం కుక్కల దాడిలో గాయాలపాలవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి రక్షించాలని కోరుతున్నారు.

లాడ్జిలో ఆత్మహత్య

పాల్వంచ: పట్టణంలోని బీసీఎంరోడ్‌లో గల ఓ లాడ్జిలో వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. మణుగూరుకు చెందిన ఎండీ పాషా (30)కి పదేళ్ల కిందట వివాహం జరిగింది. ఇటీవల దంపతుల మధ్య గొడవలు జరగడంతో భార్య పుట్టింటికి వెళ్లిది. ఈ క్రమంలో మంగళవారం పాల్వంచలోని లాడ్జిలో మధ్యాహ్నం 3.30 గంటలకు గది తీసుకున్నాడు. సాయంత్రం లాడ్జి సిబ్బంది చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. మృతుడికి భార్య సిరదాస్ ఉన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బి.రాము తెలిపారు.

అదుపుతప్పిన ట్రాక్టర్


విద్యుత్ సబ్‌స్టేషన్ గోడను ఢీకొట్టిన ట్రాక్టర్

టేకులపల్లి: అతి ట్రాక్టర్ అదుపుతప్పి విద్యుత్ సబ్‌స్టేషన్ గోడను ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. కోయగూడెం గ్రామానికి చెందిన పోలెబోయిన వినోద్, పూనెం నాగరాజు కలిసి మంగళవారం ట్రాక్టర్ నడుపుతూ రావులపాడు వైపు బయలుదేరారు. అతి వేగంగా డ్రైవింగ్ చేస్తూ వెళ్లడం వల్ల విప్పలతండా సమీపంలో అదుపుతప్పి విద్యుత్ సబ్‌స్టేషన్ గోడను బలంగా ఢీకొట్టింది. వినోద్, నాగరాజులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కేసు నమోదు

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన దేవరపల్లి మోహన్‌రెడ్డి, కురుగుంట్ల రవీందర్‌రెడ్డి, పిన్నెల్లి శ్రీనివాసరావుపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తూము కోటేశ్వరరావు స్కూల్ వద్ద ఉండగా ఆ ముగ్గురు వ్యక్తులు అతడితో గొడవ పడి కొట్టి చంపుతామని బెదిరించారు. దీనిపై కోటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నాగుల్‌మీరా ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

అడవిపంది దాడిలో వ్యక్తికి గాయాలు

గుండాల: తునికాకు కట్టలకు కట్ల(నార) కోసం అడవికి వెళ్లిన ఓ వ్యక్తిపై అడవిపంది దాడిచేసిన ఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. తునికాకు కట్టలు కట్టేందుకు నార అసరం కావడంతో ఆళ్లపల్లి మండలంలోని లొద్దిగూడెం గ్రామానికి చెందిన పాయం లక్ష్మీనారాయణ స్థానికులతో కలిసి అడవికి వెళ్లాడు. ఈక్రమంలో పొదలమాటున ఉన్న పంది అతడిపై ఒక్కసారిగా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రున్ని స్థానిక వైద్యుల వద్దకు తీసువచ్చి చికిత్స అందించారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్‌లో మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేసిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. బాధితురాలు నరేట్ల ప్రమీల కథనం ప్రకారం.. మండలంలోని సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ గిరిజన గురుకుల కళాశాల వీధికి చెందిన ప్రమీల ఉదయం ఏడు గంటల సమయంలో ఆరుబయట వాకింగ్ చేస్తోంది. అదే సమయంలో ముఖానికి తెల్లటి రుమాలు కట్టుకున్న వ్యక్తి బైక్‌పై వేగంగా వచ్చి ఆమె మెడలోని 2.50 తులాల బంగారు గొలుసును లాక్కొని వెళ్లిపోయాడు. ఈ ఘటనతో షాక్‌కు గురైన మహిళ తేరుకునేలోపు చోరీకి పాల్పడిన వ్యక్తి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

గుండాల: అనుమానాస్పద స్థితిలో ఓ యువతి మృతి చెందిన ఘటన ఆళ్లపల్లి మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. తునికబండల గ్రామానికి చెందిన ఈసం రమ్య (20) ఇటీవలే ఇంటర్ పూర్తి చేయగా మంగళవారం ఉయదం కంప్యూటర్ కోచింగ్ కోసం కొత్తగూడెం వెళ్లాల్సి ఉంది. కాగా కుటుంబ సభ్యులు ఉదయాన్నే రమ్యను నిద్ర లేపుతుండగా నోట్లో నురగ వచ్చి అపస్మారక స్థితిలో ఉంది. వెంటనే కుటుంబ సభ్యులు ఆళ్లపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా ఆమె అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

బొగ్గు రవాణాకు అడ్డుకట్ట

కిష్టారం ఓసీ వద్ద బైఠాయించిన లారీ యజమానులు



- కిష్టారం ఓసీ వద్ద లారీ యజమానుల ఆందోళన
- ఉద్రిక్తంగా మారిన వంటా వార్పు


సింగరేణి అధికారులతో వాగ్వాదం చేస్తున్న లారీ యజమానులు

సత్తుపల్లి: సత్తుపల్లి లారీలకు నాణ్యమైన బొగ్గు ఇవ్వడం లేదని నిరసిస్తూ మంగళవారం లారీ యజమానులు కిష్టారం ఓసీ వద్ద బైఠాయించి బొగ్గు రవాణాను అడ్డుకున్నారు. సింగరేణి క్వాలిటీ అధికారి మదన్‌మోహన్ లారీలకు బొగ్గు లోడింగ్‌లు రానివ్వకుండా చేయటం వల్లే ఫ్యాక్టరీలు సత్తుపల్లి బొగ్గును కొనేందుకు ముందుకు రాకపోవటం వల్ల సమస్యలు తలెత్తాయని లారీ యజమానులు సింగరేణి అధికారులతో వాగ్వాదానికి దిగారు. కిష్టారం ఓసీ లో నాణ్యమైన జీ-7, జీ-8 బొగ్గు నిల్వలు ఉన్నప్పటికీ ఫ్యాక్టరీలకు ఇచ్చేటప్పుడు జీ-13, నల్లబండరాళ్లు లోడ్ చేయడంతో రోజుల తరబడి లారీలు నిలి చిపోతున్నాయని, దీనిపై సింగరేణి అధికారులకు ఎన్ని విజ్ఞప్తులు చేసినా పట్టించుకోక పోవటం వల్లే లోడింగ్ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. సత్తుపల్లి లారీలకు ఉత్పత్తిలో 40 శాతం రవాణాకు ఇవ్వాల్సి ఉండగా కేవలం 20 లారీలకు మాత్రమే లోడింగ్‌లు ఇస్తూ లారీ యజమానులను మానసిక క్షోభకు గురిచేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక దశలో అధికారులపై దురుసుగా వెళ్లేందుకు లారీ యజమానులు ప్రయత్నించటంతో సర్దిచెప్పారు. అయితే, సింగరేణి పీఓ నర్సింహారావు లారీ యజమానులతో చేసిన చర్చలు ఫలించకపోవటంతో ఆందోళన మరింత తీవ్రతరం చేశారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు లారీలను కదలనిచ్చేది లేదని, సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కొండపల్లి రమేశ్‌రెడ్డి, ఎస్‌కే కిజర్ స్పష్టం చేశారు. కాగా, రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌కు బొగ్గును రవాణా చేసేందుకు వచ్చిన లారీలు ఆందోళన తీవ్రతరం కావటంతో వెనక్కి వెళ్లిపోయ్యాయి. కాగా, ఏ ఫ్యాక్టరీ నుంచి కూడా బొగ్గు నాణ్యతపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు రాలేదని, ఫ్యాక్టరీలకు బొగ్గు అవసరం లేనందునే తీసుకోవటం లేదని సింగరేణి పీఓ నర్సింహారావు తెలిపారు. కాగా, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దృష్టికి మంగళవారం రాత్రి సమస్యను తీసుకెళ్లారు. సింగరేణి అధికారులతో చర్చిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఆందోళనలో ఎస్‌కె మౌలాలీ, వేముల విశ్వనాథం, వెలిశాల చెన్నాచారి, పీఎల్ ప్రసాద్, లియాకత్, మోహన్‌రావు, మునీర్, చిన్నంశెట్టి శ్రీను, ఎస్‌కే బాజీ, పి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విజ్ఞతతో ఓటు వేశారు


మాట్లాడుతున్న నామ నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం జిల్లా ప్రజలు ఎంతో చైతన్యవంతులని, వారు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేశారని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు అన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు బీఆర్ఎస్‌కే పడిందని, తాను మంచి మెజార్టీతో గెలుస్తానన్న నమ్మకం, విశ్వాసం ఉందన్నారు. మంగళవారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ గ్రామం వెళ్లినా కుల, మతాలకతీతంగా తనను ఆశీర్వదించి, మద్దతుగా నిలిచారని చెప్పారు. కేసీఆర్ రోడ్డు షో సందర్భంగా కూడా భారీగా ప్రజలు తరలివచ్చారని చెప్పారు. ఆరు నెలల కాలంలో తాగు, సాగు నీరు, కరెంట్ కోతల వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. ఏదిఏమైనా తమకు అనుకూలంగా మంచి ఫలితాలు వస్తాయనే గట్టి నమ్మకం ఉందని చెప్పారు. తన విజయం కోసం అహర్నిశలు శ్రమించిన పార్టీ మాజీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు, సీనియర్ నాయకులు, జిల్లా, మండల, గ్రామ, బూత్ స్థాయి నాయకులు, అభిమానులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు, తెలియజేశారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడారు. సమావేశంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరరావు, పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, ఉప్పల వెంకటరమణ, కూరాకుల నాగభూషణం, బిచ్చాల తిరుమల్‌రావు, ఆర్జేసీ కృష్ణ, బెల్లం వేణుగోపాల్, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

'మీ అభిమానాన్ని గుండెల్లో పెట్టుకుంటా'

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం పార్లమెంట్ స్థానంలో ఓటర్ల చైతన్యం సోమవారం పోలింగ్‌తో స్పష్టమైందని, 75.19 శాతంతో ఖమ్మం రాష్ట్రంలోనే మేటిగా నిలవడం గొప్ప పరిణామమని ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. ఇందులో తాను భాగస్వామి నియినందుకు గర్వపడుతున్నానని, కాంగ్రెస్ పార్టీని అజేయశక్తిగా నిలిపేందుకు శ్రమించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, జారె ఆదినారాయణ, మాలోత్ రాందాస్‌నాయక్, కూనంనేని సాంబశివరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తోపాటు సీపీఐ, సీపీఎం, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్, టీడీపీ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. తనపై కురిపించిన ప్రేమ, అభిమానాన్ని ఎప్పటికీ గుండెల్లో దాచుకుంటానని, ఈ ఎన్నికల సాక్షిగా పెనవేసుకున్న బంధాన్ని జీవితకాలం పాటు కొనసాగిస్తానని రఘురాంరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పండితాపురంలో చోరీ

కామేపల్లి: మండలంలోని పండితాపురం గ్రా మంలో అర్ధరాత్రి ఓ ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధితుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జల్లి సంజయ్ రోజువారీ ప్లాస్టిక్ వస్తువుల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. రోజు వారీలాగే కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి ముందు నిద్రకు ఉపక్రమించాడు. అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బీరువా తాళం తీసి బీరువాలో దాచిన సుమారు రూ.1.10 లక్షల నగదు. రూ.60 వేల విలువైన బంగారం, వెండి ఆభరణాలను అపహరించారు. తెల్లవారుజామున నిద్ర నుంచి లేచి చూడగా ఇంట్లో సామగ్రి చెల్లాచెదురుగా పడి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించాడు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా క్లూస్ టీం వచ్చి వేలిముద్రలను సేకరించారు. కాగా, గ్రామానికి చెందిన అంబడిపూడి వెంకటేశ్వర్లు ఇంట్లోనూ ఎవరూ లేని సమయంలో ఇంట్లోకి చొరబడి చోరీకి యత్నించారు. కానీ, ఇంట్లో నగదు, ఆభరణాలు ఏమీ దొరక్కపోవడంతో వెళ్లిపోయారు.